రాయదుర్గంలో హైడ్రా కూల్చివేతలతో నిరాశ్రయులైన బాధితులు

అమీన్‌పూర్ మున్సిపాలిటీ మండల పరిధి ఐలాపూర్ తాండ పంచాయతీ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న సర్వేనంబరు 462లో నిర్మాణాలను కూల్చిన అధికారులు

మెహిదీపట్నం డివిజన్ అయోధ్యనగర్ కాలనీలో కూల్చివేతలు చేపడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్ -12 టౌన్‌ప్లానింగ్ అధికారులు

'కోర్టు ఆదేశాలా.. వియ్ డోంట్‌కేర్'

న్యాయస్థానాల స్టేలను సైతం లెక్కచేయని రేవంత్ సర్కార్.. సంచలనంతో ప్రజల దృష్టి మరల్చేందుకే కూల్చివేతల పర్వం

- నాడు అయ్యప్ప సొసైటీ కూల్చివేతల సమయంలో ఓ నీతి
- ఇప్పుడు సీఎం కుర్చీలో బుల్డోజర్ రీతి
- కాంగ్రెస్ నేతల జోలికి వెళ్లని ప్రభుత్వం
- గండిపేట ఎఫ్‌టీఎల్‌లో నిక్షేపంగా పల్లంరాజు అక్రమ నిర్మాణం
- హైడ్రా కూల్చివేసిందంటూ సీఎం, బాకా పత్రిక తప్పుడు ప్రచారం

శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి ఉన్నది. ఇది హైదరాబాద్ టెన్నలిస్‌కు చెందినదని, దాని పూర్తి హక్కులు తమ వంశపారంపర్యంగా వస్తున్నాయంటూ కొన్ని కుటుంబాలు అక్కడ ఇండ్లు కట్టుకొని ఉంటున్నారు. ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉన్నది. హైకోర్టు స్టే కూడా కొనసాగుతుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా గత నెల 26న తెల్లారుజామున ఉదయం 5 గంటలకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాబ్, టీఎస్ఐఐసీ అధికారులు సుమారు వంద మంది పోలీసు బలగాల మోహరింపుతో మూడు కుటుంబాలను నిర్బంధించి బుల్డోజర్లతో ఇండ్లను నేలమట్టం చేశారు. దీంతో ఆ కుటుంబాలు కట్టుబట్టలతో వీధినపడ్డాయి.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 462లో ఇటీవల రెవెన్యూశాఖ కొన్ని నిర్మాణాలను కూల్చివేసింది. వాస్తవానికి ఈ నిర్మాణాలపై హైకోర్టు స్టే ఉన్నది. ఇందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు, స్టే ఉత్తర్వులను యజమానులు అధికార యంత్రాంగానికి కూడా సమర్పించారు. ఇవేమీ పట్టించుకోకుండా, నోటీసులూ ఇవ్వకుండా అధికారులు ఆ నిర్మాణాలను కూల్చివేశారు.

గత నెల 18న హైడ్రా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలంటూ కొన్నింటిని కూల్చివేసింది. ఈ సందర్భంగా ఒక యజమాని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సంప్రదించారు. హైకోర్టు స్టే ఉన్నప్పుడు నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు ఇవ్వాలి కదా సార్! అన్నారు. 'ముందస్తు నోటీసులు ఇస్తే మీరు కోర్టుకు పోతారు కదా!' అని కమిషనర్ సెలవిచ్చారట.

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, అధికార యంత్రాంగం కక్షపూరితంగా వ్యవహరించినపుడు సామాన్యుడికి దిక్కయ్యేది న్యాయస్థానాలే. మరి.. అలాంటి న్యాయస్థానాల ఆదేశాలను సైతం రేవంత్ సర్కారు బేఖాతరు చేస్తుంది. 'అంతా మా ఇష్టం.. కోర్టు స్టేలను సైతం ధిక్కరిస్తాం..' అన్నట్టు ఇష్టానుసారంగా నిర్మాణాలను కూల్చివేస్తున్నది. యథా రాజా... తథా ప్రజా అన్నట్టు రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా, ఇతర శాఖలు సైతం ఒకవైపు నిర్మాణాలపై బుల్డోజర్లతో దాడిచేయడంతో పాటు న్యాయస్థానాల ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకపోవటం గమనార్హం. రాజ్యాంగబద్ధంగా న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రాథమిక హక్కులను సైతం ప్రభుత్వం కాలరాయటం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను పరిగణనలోనికి తీసుకోకుండా ముందుకు పోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సామాన్యుడు కోర్టు తలుపులు తట్టడమే నేరంగా.. ఆ దారులు మూసివేస్తాం! అన్నట్టు హైడ్రా, ప్రభుత్వ వైఖరి ఉండటం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

నాడు ఒక నీతి... ఇప్పుడు మరో రీతి

'సోమేశ్‌కుమార్ అంత పొడుగు.. ఇంత పొడుగు అంటడు. పొయ్యి అయ్యప్ప సొసైటీలో ఉన్నపళంగా రూపాయి.. రూపాయి.. జమ చేసుకొని ఉద్యోగస్థులు 200 గజాలు, 400 గజాల్లో ఇండ్లు కట్టుకుంటే జేసీబీలు, పెద్దపెద్ద మిషన్లు తీస్కపోయి నేలమట్టం చేసిండు. చట్టంలో అక్రమాలు జరిగినా క్రమబద్ధీకరించే (రెగ్యులర్) నిబంధన ఉన్నది. వాళ్లేం దోపిడీ చేయలే.. వాళ్లేం దేశద్రోహం చేయలే.. వాళ్లు అమాయకంగా కొనుక్కున్నరు. దాంట్లో కట్టుకున్నరు. అనుమతులు లేకపోతే రెగ్యులరైజ్ చేయటానికి నిబంధన ఉన్నది. నేలమట్టం చేయాల్సిన అవసరం ఉన్నదా సార్? ఇయాల ప్రభుత్వ భూముల్లో ఉంటే మీరు రెగ్యులరైజ్ చేయించుకోండి, బిల్డింగ్‌లు కట్టుకుంటే రెగ్యులరైజ్ చేయించుకోండి. నువ్వు అయ్యప్ప సొసైటీ కాడికి ఒక ఫార్ములా ఇచ్చేదుండె! కటాఫ్ డేట్ ఇచ్చేదుండె'

- నాటి బీఆర్ఎస్ సర్కారుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలివి. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ ప్రభుత్వం అక్రమ నిర్మాణాల్ని కూల్చివేయడాన్ని తప్పుబడుతూ క్రమబద్ధీకరణ చేయొచ్చు కదా! అని ఉచిత సలహా ఇచ్చారు. ఎండీ రాధాకృష్ణ సైతం అందుకు వంత పాడారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నీతులు, ఉచిత సలహాలను రేవంత్ విస్మరించటం గమనార్హం. మరి ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడకుండా క్రమబద్ధీకరణ విధానాన్ని అవలంబించవచ్చు కదా అని సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

కూడబలుక్కున్నా నిజం దాగుతుందా?

రేవంత్ ప్రభుత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నది. పైగా బాకాపత్రికతో అదే గాంభీర్యాన్ని ప్రచారం చేసుకుంటున్నది. గత నెల 18న గండిపేటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ పలు నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఖానాపూర్ గ్రామపరిధిలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు గెస్ట్ హౌస్, దానికి కొంతదూరంలో ఆయన సోదరుడికి చెందిన ఓరో స్పోర్ట్స్‌విలేజ్ ఉన్నది. హైడ్రా అధికారులు కేవలం ఓరో స్పోర్ట్స్ విలేజ్ నిర్మాణాల్ని కూల్చివేశారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టంచేశారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సైతం తన ట్వీట్‌లో కూడా తన సోదరుడి నిర్మాణాన్ని కూల్చివేసినట్టు ప్రకటించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు మాత్రం పల్లంరాజు గెస్ట్‌హౌస్‌ను కూల్చేసినట్టుగా చెప్తున్నారు. హైడ్రా అక్కడికి వెళ్లిన సమయంలో పల్లం రాజు ఢిల్లీ నుంచి ఫోన్ చేయించి తన నిర్మాణాన్ని కూల్చివేయకుండా ఆపించినట్టు ప్రచారం జరిగింది. అయినా పల్లం నిర్మాణాన్ని కూల్చివేసినట్టు రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం విడ్డూరం. ఇప్పటికీ ఆయన నిర్మాణం నిక్షేపంగా అక్కడే ఉన్నది. రేవంత్ బాకాపత్రిక ఆంధ్రజ్యోతిలోనూ పదేపదే పల్లం రాజు నిర్మాణాన్ని కూల్చివేసినట్టు ప్రచారం చేస్తున్నారు. కానీ ఫొటోలు చూస్తే వాస్తవమేదో అర్థమవుతుంది.

కాంగ్రెస్ నేతల దరిచేరని కూల్చివేతలు

పారదర్శకంగా, రాజకీయ కక్షలకు తావులేకుండా కూల్చివేతలు చేపడుతున్నామని ఇటు హైడ్రా.. అటు రేవంత్ ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నది. కానీ.. హైడ్రాతో పాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలు జారీ చేస్తున్న నోటీసుల్లో ఏ ఒక్క కాంగ్రెస్ నేత అక్రమ నిర్మాణాలు లేకపోవటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జంట జలాశయాల పరిధిలో కాంగ్రెస్ మంత్రులు, నేతలకు చెందిన అక్రమ నిర్మాణాలపై పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ఆధారాలతో సహా బయటపడ్డా హైడ్రా, ఇతర సంబంధిత శాఖలు అటువైపు అడుగులు వేయకపోవటాన్ని ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

హైడ్రాది రాజకీయ లక్ష్యం!

హైదరాబాద్ పరిధిలో చెరువులు కాలగర్భంలో కలిశాయంటే అది సమైక్య పాలకుల పుణ్యమే. మూసీనదిని మురికికూపంగా మార్చిన ఘనత వారిదే. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని వెలగబెట్టిన పార్టీలు రెండే రెండు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పాలిస్తే, మిగిలిన కాలం తెలుగుదేశం పార్టీదే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలన్నీ గత పదేండ్లలోనే వెలిసినట్టు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. రాజకీయ కోణంలోనే హైడ్రాను ఏర్పాటు చేశారన్న విమర్శలకు కొన్ని ఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఒక విధానమంటూ లేకపోవడం హైడ్రా లక్ష్యంపై అనుమానాలు కలిగిస్తున్నాయి. ఒక ప్రాంతం, చెరువు, జలాశయాలు.. ఏదో ఒకటి ప్రామాణికంగా అక్రమ నిర్మాణాల్ని గుర్తించి రాజకీయాలకు అతీతంగా కూల్చివేతలు చేపట్టాలి. కానీ విధానమంటూ లేకుండా హైడ్రా కూల్చివేతలు చేపట్టడం, వివిధ శాఖలు కక్షపూరితంగా నోటీసులు జారీచేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తున్నది.

లోకం పోకడ

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
కరీంనగర్	31.0°c	25.0°c
ఆదిలాబాద్	30.2°c	23.5°c
నల్లగొండ	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	24.0°c
మహబూబ్‌నగర్	28.1°c	23.4°c
ఖమ్మం	28.0°c	23.0°c
హైదరాబాద్	28.0°c	23.0°c
రంగారెడ్డి	27.1°c	22.0°c
మెదక్	27.0°c	22.0°c
నిజామాబాద్	25.6°c	23.3°c

హైడ్రా పేరుతో బెదిరింపులు

నిందితుడు విప్లవ్

హైదరాబాద్ సిటీ బ్యూరో/ సంగారెడ్డి, సెప్టెంబర్ 4: హైడ్రా పేరు చెప్పి వసూళ్లకు పాల్పడిన ఫిజియోథెరపిస్ట్ బండ్ల విప్లవ్‌ను సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ రూపేశ్ బుధవారం సంగారెడ్డిలో వివరాలు వెల్లడించారు. అమీన్‌పూర్‌లో విల్లా నిర్మాణాలు చేపట్టిన రాజేందర్ అనే యజమానిని సాయివిల్లాస్ కాలనీలో ఉండే బండ్ల విప్లవ్ రూ.20లక్షలు డిమాండ్ చేశాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు దగ్గరని బెదిరించాడు. ఈ నెల 3న రాజేందర్, అతని పార్ట్‌నర్ మంజునాథ్‌రెడ్డి మరో ఇద్దరితో కలిసి బండ్ల విప్లవ్ సిన్హా ఇంటికి వెళ్లి రూ.2లక్షలు అడ్వాన్సుగా ఇస్తుండగా టాస్క్‌ఫోర్స్, అమీన్‌పూర్ పోలీసులు పట్టుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

హైడ్రా పేరుతో దందాలకు దిగితే జైలే: రంగనాథ్

హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడితే స్థానిక పోలీస్‌స్టేషన్, ఎస్పీ, సీపీలు, హైడ్రా కమిషనర్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు.

లంచమడిగితే ఫోన్‌చేయండి: ఏసీబీ డీజీ

హైడ్రా పేరిట ఎవరైనా లంచమడిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తెలిపారు. భూ, ఇండ్ల యజమానులకు గతంలో జారీ చేసిన నోటీసులను అడ్డుపెట్టుకొని కొందరు ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. నకిలీ నోటీసులు పంపించినా, ఫోన్‌కాల్స్ చేసినా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్18001064కు ఫోన్‌చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో హైడ్రా చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి క్లాస్ ఇచ్చినట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. ఏకపక్ష, విచ్చలవిడి నిర్ణయాలతో పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేయొద్దని గట్టిగానే చెప్పినట్టు తెలిసింది.

మాకు మాట మాత్రమైనా చెప్పలేదు

పార్టీలో ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. హైడ్రా వ్యవహారంలోనూ ఏకపక్షంగానే నిర్ణయం తీసుకున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. పార్టీలో ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే దీన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు తెలిసింది. కనీసం మంత్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు, మంత్రులు సీఎం నిర్ణయంపై గుర్రుగా ఉన్నారు. ఈ వ్యవహారాన్ని ఢిల్లీలోనే తేల్చుకోవాలని వాళ్లంతా నిర్ణయించి, అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. హైడ్రా విధానాలు తన శాఖ పరిధిలోకి వస్తున్నప్పటికీ ఆ శాఖ మంత్రిగా ఉన్న తనకు కనీసం మాట కూడా చెప్పలేదని ఓ సీనియర్ మంత్రి అధిష్ఠానం వద్ద తన ఆవేదనను వ్యక్తం చేసినట్టు సమాచారం. హైడ్రాతో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఓ మంత్రి వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

రాష్ట్రంలో ఏం జరుగుతున్నది: ఖర్గే క్లాస్!

హైడ్రా కూల్చివేతల్లో భాగంగా పల్లం రాజు తమ్ముడు ఆనంద్‌కు చెందిన స్పోర్ట్స్ విలేజ్‌ను కూల్చివేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన పల్లం రాజు నేరుగా ఖర్గేను కలిసి ఫిర్యాదు చేశారు. కష్టపడి సంపాదించిన డబ్బులతో తన తమ్ముడు ఏడెకరాల స్థలంలో స్పోర్ట్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారని, కనీసం నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, సీనియర్ నేతలతో పాటు పల్లం రాజు కూడా ఫిర్యాదు చేయటంతో రేవంత్‌పై ఖర్గే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి.. 'అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నది?' అని ప్రశ్నించినట్టు సమాచారం. హైడ్రా వంటి కీలక నిర్ణయం తీసుకున్నప్పుడు పార్టీ అధ్యక్షుడిగా తనకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని నిలదీసినట్టు తెలిసింది. రాహుల్‌గాంధీకి చెప్పి అనుమతి తీసుకొన్నానని రేవంత్ బదులిచ్చినట్టు తెలిసింది. రేవంత్ మాటలతో ఖర్గే విసుగెత్తి తన పక్కనే ఉన్న పల్లంరాజుతో 'ఆయన తలతిక్కగా మాట్లాడుతున్నారు. మీ ఆగ్రహాన్ని ట్విటర్‌లో పెట్టండి' అంటూ సూచించినట్టు తెలిసింది. దీంతో వెంటనే పల్లం రాజు.. ఖర్గేను కలిసిన ఫొటోను ట్విటర్‌లో షేర్ చేసి హైడ్రాతో రేవంత్ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ఎండగట్టారు. ఖర్గేతో వివాదాన్ని డైవర్ట్ చేసేందుకు తనకు అనుకూలమైన పత్రికలో దాని అధిపతి రాసే కాలమ్‌లో.. హైడ్రాకు రాహుల్‌గాంధీ సపోర్ట్ ఉన్నట్టు రాయించుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. రేవంత్‌రెడ్డికి కొన్ని నెలలుగా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంటే దొరకటం లేదని, అలాంటప్పుడు హైడ్రాపై ఆయన అనుమతి ఏ విధంగా తీసుకుంటారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఖర్గేను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ పేరును సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగించుకున్నారనే ప్రచారం జరుగుతున్నది.



ఆగస్టు 27న ఖర్గేను కలిసిన పల్లంరాజు

ఆ నేతలే టార్గెట్‌గా హైడ్రా

ఎమ్మెల్యేగా ఉన్న ఓ మీడియా అధిపతి, కీలక మంత్రి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు దగ్గరగా ఉండే మంత్రి టార్గెట్‌గా హైడ్రాను తీసుకొచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు మంత్రి.. షర్మిల సహాయంతో ఢిల్లీలో తన పరపతిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానం రేవంత్‌రెడ్డిలో నెలకొన్నదని తెలిసింది. ఆ మంత్రికి ఆర్థిక బలం, నాడు అధిష్ఠానంతో దగ్గరగా మెలిగిన నేత రామసహాయం సురేందర్‌రెడ్డి కుటుంబంతో బంధుత్వం కూడా ఉన్నది. ఆ మంత్రి.. తనకు పోటీ అవుతారనే ఉద్దేశం రేవంత్‌రెడ్డిలో ఉన్నదని తెలిసింది. ఆయనను హైడ్రా ద్వారా లొంగదీసుకోవాలని భావించినట్టు తెలిసింది. ఇతర పార్టీలకు చెందిన నేతలను భయపెట్టేందుకూ హైడ్రాను బూచిగా చూపెడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. చేరితే పార్టీలో చేరండి.. లేదంటే హైడ్రా బుల్డోజర్ దూసుకొస్తదని బెదిరింపులు చేస్తున్నారన్న గుసగుసలు పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

'ఇప్పుడెందుకీ వ్యవహారం?'

హైడ్రా పేరుతో ఆక్రమ భవనాలను కూల్చివేయడంపై కాంగ్రెస్‌లోనే తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ముందుగా బడాబాబుల ఇండ్లపై హైడ్రా బుల్డోజర్ వెళ్లినప్పుడు పెద్దగా ఎవరూ స్పందించలేదు. కానీ ఇది పేదల ఇండ్లపైకి మళ్లటంతో పార్టీ నేతల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు, ప్రభుత్వ పనితీరుతో ప్రజల్లో వ్యతిరేకత నెలకొన్నదని, హైడ్రా వ్యవహారంతో ఇది మరింత పెరిగే ప్రమాదం ఉన్నదని వాళ్లంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చితే పార్టీ పరిస్థితి ఏమిటని నేతలు తలలు పట్టుకుంటున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పలువురు మంత్రులు అధిష్ఠానం వద్ద మొరపెట్టుకొని.. ఇప్పుడీ తలనొప్పి అవసరమా! అని అన్నట్టు సమాచారం.

.. వెంటనే కూల్చి పారేయండి

మొదటిపేజీ తరువాయి...

సీఎం, మంత్రులు చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. అజయ్ ఆక్రమణల వల్లే ఖమ్మం మునిగిందంటూ సీఎం చేస్తున్న ఆరోపణల్లో పస లేదని పేర్కొన్నారు. తన దవాఖాన ఖమ్మం ఉత్తర దిక్కున ఉన్నదని, మున్నేరుకు దానికి అసలు సంబంధమే లేదని వివరించారు. హాస్పిటల్ నిర్మించి 25 ఏండ్లు అయిందని, ఆ ప్రాంతాల్లోకి చుక్క నీరు రాలేదని తెలిపారు. మున్నేరుకు వరద ఎక్కడి నుంచి వస్తున్నదో రేవంత్‌రెడ్డికి తెలుసా? అని ప్రశ్నించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో రాజీవ్ గృహకల్ప, జలగంనగర్ కాలనీలు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు

రిటైనింగ్ వాల్‌కు కేసీఆర్ 650 కోట్లు ఇచ్చారు

పాకాల సరస్సు వద్ద పుట్టిన మున్నేరులో ఆకేరు, వైరా ప్రవాహాలు కలుస్తాయని, ఏటా మున్నేరు పొంగడం సహజమేనని పువ్వాడ వివరించారు. బీఆర్ఎస్ పాలనలో మున్నేరు వరద పొంగినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి అక్కడి నుంచి తరలించేవారమని తెలిపారు. ఇప్పుడు వాతావరణ శాఖ హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తరలించడంలో విఫలమైందని విమర్శించారు. వరదలకు శాశ్వత పరిష్కారం లభించాలనే ఉద్దేశంతో మున్నేరుకు రెండువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.650 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. వాల్ నిర్మాణ పనులను రేవంత్ ప్రభుత్వం పునరుద్ధరించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అజయ్‌ను అంతమొందిస్తే బాధలు పోతయా?

అజయ్‌ను అంతమొందిస్తే వరద బాధితుల బాధలు తీరుతయా? అని పువ్వాడ ప్రశ్నించారు. వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్తే కాంగ్రెస్ నేతలు తమపై దాడులు చేశారని, వారి పేర్లతోపాటు సీపీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఖమ్మంలో తుమ్మల మనుషులే తమపై దాడి చేశారని చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం మోకాళ్లలోతు బురదలో దిగి బాధితులను పరామర్శిస్తే, ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం ఎన్నికల పర్యటనకు వచ్చినట్టు వచ్చి వెళ్లారని మండిపడ్డారు. మూడు రోజులైనా మున్నేరు వరద బాధితులకు విద్యుత్తు, తాగునీరు అందలేదని విమర్శించారు.

ఒక్కరినైనా ఎందుకు అరెస్టు చేయలేదు: గోపాల్

ఖమ్మంలో బీఆర్ఎస్ బృందంపై దాడి కాంగ్రెస్ గూండాల పని అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. ఖమ్మంలో కబ్జాలన్నీ కాంగ్రెస్ నేతల చలవేనని విమర్శించారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే ముందు కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలు కూల్చాలని సవాల్ చేశారు. వరద బాధితులను ఆదుకొనే చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం గూండాయిజాన్ని ప్రోత్సహించడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.

దాడికి దర్శకుడు రేవంతే: బాల్క సుమన్

ఖమ్మంలో బీఆర్ఎస్ బృందంపై జరిగిన దాడికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రేవంత్‌రెడ్డి, నిర్మాత పొంగులేటి అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. చివరి రక్తపు బొట్టు వరకు తెలంగాణ ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టంచేశారు. ఇప్పటి వరకు ఈ ఘటనపై డీజీపీ స్పందించలేదని, పోలీసులు అతిగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతల కబ్జా చిట్టా బయటపెడతామని చెప్పారు. హైడ్రా పేరిట కొంతమందిని లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు చేస్తున్నారని ఆరోపించారు.

2 నెలలకు సరిపడా సరుకులివ్వాలి: నవీన్

మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు ఏ మూలకు సరిపోవని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇల్లు నీట మునిగిన కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతోపాటు నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాడు హెలికాప్టర్ తెప్పించాలని కోరిన సీతక్క నేడు మంత్రిగా ఉండి ఎందుకు తెప్పించలేకపోయారని ప్రశ్నించారు.

పొంగులేటి ఎస్ఆర్ గార్డెన్ సంగతేమిటి?

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ఫంక్షన్ హాల్ నిర్మించారని, జిల్లాకు చెందిన మరో మంత్రి వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమించి విల్లాలు కట్టారని పువ్వాడ అజయ్ ఆరోపించారు. పొంగులేటి నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఎప్పుడు కూల్చి వేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. మంత్రి పొంగులేటి ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామంలో సర్వే నంబర్ 140/2లో అర ఎకరానికిపైగా నీటిపారుదల శాఖ (నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్)కు చెందిన భూమిని ఆక్రమించి ఎస్ఆర్ గార్డెన్ నిర్మించారని ఆరోపించారు. గతంలో ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ సర్వే చేసి కబ్జా విషయాన్ని నిర్ధారించారని, దీనిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలకు దిగగా, పొంగులేటి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. కంచె చేను మేసినట్టు మంత్రులే ప్రభుత్వ భూములను ఆక్రమించి, పైగా తాను ఆక్రమించినట్టు బట్టకాల్చి మీదేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించి, కట్టిన నిర్మాణాలను తొలగించాలనుకొంటే ముందుగా పొంగులేటి ఎస్ఆర్ గార్డెన్‌ను కూల్చాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

కాంగ్రెస్ దాడి సిగ్గుమాలిన చర్య

ఖమ్మంలో వరద బాధితుల పరామర్శకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాల దాడి సిగ్గుమాలిన చర్య. బురద రాజకీయం చేయొద్దన్న సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నదేమిటి? ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోదు.. ప్రతిపక్షం ఆదుకునేందుకు ముందుకొస్తే కాంగ్రెస్ కార్యకర్తలతో దాడులు చేయిస్తారా? మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి కార్లపై దాడిచేసిన కాంగ్రెస్ కార్యకర్తను అరెస్టు చేయాలి.

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

దాడి పిరికిపందల చర్య

ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందంపై ప్రభుత్వం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న. విపత్కర పరిస్థితిలో ప్రజలకు అండగా ఉండాల్